క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మక్కువలో ఎంపీడీవో దేవకుమార్ ప్రారంభించిన చలివేంద్రం

మక్కువ: మండలకేంద్రం మక్కువ ప్రధానర హదారిపై మూడురోడ్లు కూడలివద్ద ఎంపీడీవో పి.దేవకుమార్ సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. ఎండలు మండుతున్నందున ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో ఈ సందర్భంగా తెలిపారు. సుదూర ప్రాంతాలనుంచి, తమ, తమ పనులపై మండలకేంద్రానికి వచ్చిన ప్రజల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటుచేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీసీపీఓ ఎంఏ నాయుడు

పార్వతీపురంటౌన్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఇన్‌చార్జి డీసీపీఓ ఎం.ఎ నాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చదువులే ముఖ్యమని, బాల్య వివాహాలు చేసి వారి భవిష్యత్‌ను పాడుచేయవద్దని తల్లిదండ్రులకు హితవు పలికారు. సీడీపీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లల హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి అవగాహన కల్పించారు. బాలల అక్రమ రవాణా, బాలికలకు ఆపద సమయంలో అవసరమైన సహాయం కోసం చైల్డ్ కేర్ హెల్ప్ లైన్‌ను ఎలా సంప్రదించాలో సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఇన్‌చార్జి పీఓ ఎన్.ప్రసాదరావు, అన్నపూర్ణ, రమణమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కె. అరవింద రావు

పార్వతీపురంటౌన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని తహసీల్దార్ కె.ఆరవిందరావు అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రిసైడింగ్ అధికారులతో ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లు తదితర ప్రచార సామగ్రి ఉండరాదని స్పష్టం చేశారు. ఎంసీసీ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ నియమ నిబంధనలను పటిష్టంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఎటువంటి అలసత్వం వహించారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతల కారణంగా జాగ్రత్తలు పాటించాలి



తహసీల్దార్ శ్రీనివాసరావు

సీతానగరం: నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్లవద్దని, ఒంట్లోనే ఉండాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశాల మేరకు ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారులంతా ఉదయం 10 గంటలకే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుని విశ్రాంతి తీసుకోవాలని కోరారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు పనుల్లో పాల్గొని సాయంత్రం వేతనం గిట్టుబాటయ్యే విధంగా పనులు చేయాలని సూచించారు. వేసవిలో తిరుగాడే ప్రజలు, వాహన చోదకులు, ప్రయాణికులకు అందు బాటులో తాగునీరుండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర రహదారిలో లచ్చయ్యపేట, అంటిపేట, చినబోగిలి, సీతానగరం, జోగింపేట, గుచ్చిమి,మరిపివలస గ్రామాల కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే పశువులను ఉదయం, సాయంత్రం పూటల్లోనే మేతకు తరలించాలని, ఎండ సమయంలో చల్లని నీడనిచ్చే సాలలు, తోటల్లో ఉంచాలని కోరారు.

ప్రజామద్దతు మళ్లీ వైఎస్సార్‌సీపీకే

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం టౌన్: వెంకంపేట గ్రామంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రజామద్దతుతో రాష్ట్రంలో మళ్లీ గెలిచి నిలిచేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండవసారి పోటీ చేస్తున్న సందర్భగా పార్వతీపురం మండలంలోని వెంకంపేట పరిధిలో గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99% నెరవేర్చడమే కాకుండా హామీ ఇవ్వని అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను చేపట్టి రాష్ట్ర ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచారన్నారు. ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల ఫలితాలే మళ్లీ ఆయన్ను 2024 ఎన్నికల్లో గెలిపించి తీరుతాయని స్పష్టం చేశారు. గడపగడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుని మన ప్రాంతాన్ని మన రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా చూడాలని పిలుపునిచ్చారు. అందుకు మీ అందరి దీవెనలు, మద్దతును అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, బంకురు రవికుమార్, పార్టీ జిల్లా సెక్రటరీ వి.గురురాజు జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, పార్టీ నాయకులు మజ్జి శేఖర్, బలగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ బడే రామారావు, గృహ సారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, అనుచర గణం

సీతానగరంలో..

సీతానగరం: మండలంలోని ఓటర్లతో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయించి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పనిచేయడానికి సమాయత్తం కావాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని పెదభోగిలి పంచాయతీలో సోమవారం విస్తృతంగా ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారానికి ముందుగా ఆయన స్థానియ ఆంజనేయస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి, బాలసాయిగణపతి ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, స్థానిక ఎంపీటీసీ ఎస్ గౌరి, బురిడి కుసుమ, సచివాలయ కన్వీనర్లు కిరణ్‌కుమార్, బి.సూర్యనారాయణ,రమేష్, యు.సురేష్, నాయకులు,ఎస్ రామారావు, పార్థసారథి, తదితరలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టండి



పలగరలో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

బలిజిపేట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలగర, పెద్దింపేట, పోలినాయుడువలసలలో ఇంటింటి ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను వివరించి, గత ప్రభుత్వ హయాంలో అందించిన సంక్షేమానికి, ఈ ప్రభుత్వానికి తేడాను గమనించి, మేలు జరిగింది, లేనిది గుర్తించి ఓటు వేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న వారికి ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, వి.సాయిరాం, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జాన్, కె.సత్యంనాయుడు, ఎంపీటీసీ సాంబమూర్తి, సర్పంచ్ జయప్రకాశ్, ఎం.వెంకటరమణ, జి.మాకినాయుడు, శంకరరావు, ఎ.వినోద్, సర్పంచ్ కె.మోహనరావు, సుందరరావు, సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, పోలినాయుడు, ఎం.శ్రీనివాసరావు, కె.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట శాపం చంద్రబాబు కూటమి

- ఎంపీపీ బడ్నాన ప్రమీల



పాచిపెంట: ప్రతిపక్ష నేత చంద్రబాబు, కూటమి గెలుపు కలల కోటను కూల్చివేయడానికి వలంటీర్లంతా సిద్ధంగా ఉన్నారని పాచిపెంట ఎంపీపీ బడ్నాన ప్రమీల అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె మండల కేంద్రంలో మాట్లాడుతూ, పింఛన్ లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్లు ఈ నెల నుంచి పింఛన్‌లు పంపిణీ చేయకుండా టీడీపీ ప్రేరేపిత సంస్థ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ఫించనుదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వృద్ధాప్య, దివ్యాంగ తదితర అన్ని వర్గాల పింఛన్ లబ్ధిదారుల ఇంటికే వెళ్లి వలంటీర్లు పింఛన్ సొమ్ము అందిస్తున్నారని తెలిపారు. దీనిని ఎన్నికల వేళ టీడీపీ ప్రేరేపిత సంస్థ రాజకీయం చేసి వలంటీర్లు ఫించన్‌సొమ్ము అందించకుండా ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీర్లను పింఛన్ సొమ్ము అందించే బాధ్యత నుంచి తప్పించేలా చేయడం దారుణమని వాపోయారు. దీనివల్ల 3 నెలల పాటు పింఛన్ దారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై కక్షతో చేస్తున్న వికృత చర్యలను ఫించనుదారులు, ప్రజలు గమనించాలని కోరారు.

వర్తక సంఘ కార్యవర్గం ఎన్నిక

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని శ్రీనివాస వర్తక సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక వర్తక సంఘం కార్యాలయం వద్ద జరిగిన ఈ ఎన్నికలో ఆ సంఘం అధ్యక్షుడిగా బుడంకాయల వెంకటరావు, ఉప అధ్యక్షుడిగా అత్తిలి శ్రీను, కార్యదర్శిగా మద్ది దొరబాబు, కోశాధికారిగా ఈపరి కామేశ్వరరావు, ఉప కోశాధికారిగా కొనిశ సూర్యప్రకాష్‌రావుతో పాటు కార్యవర్గ సభ్యులుగా బోటు గౌరీశంకర్, పాట్నూరు సురేష్, నెమలిపురి వెంకీ, కోరాడ మన్మథరావు, శివ, డోకి కిషోర్ తదితరులు ఎన్నికయ్యారు. ప్రతీ మూడేళ్లకు ఒకసారి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్నట్లు చెప్పారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి





ప్రచారంలో ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: సంక్షేమ సారథి, అభివృద్ధికి వారధి అయిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మళ్లీ ఆశీర్వదించాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని కర్రివీధి, గాడివీధి, జన్ని వీధుల్లో ప్రచారం నిర్వహించారు. తమ వార్డుకు వచ్చిన ప్రియతమ నేత రాజన్నదొరకు ప్రజలు, నాయకులు బ్రహ్మరథం పట్టారు.పూలమాలలు వేసి హారతులు పట్టి ఘనంగా స్వాగతంపలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ,అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా అత్యంత పారదర్శకంగా లక్షల కోట్ల రుపాయలను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జమచేశారని చెప్పారు. ప్రతి ఇంటికి ఓ పెద్ద కొడుకులా, ఓ సోదరుడిలా అండగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజలకు మంచి చేయడమే జగన్ అజెండా కాగా,ప్రజలను మోసం చేయడమే టీడీపీ కూటమి అజెండా అని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైఎస్సార్సీపీ పట్టణాధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, నాయకులు జర్జాపు ఈశ్వరరావు,సూరిబాబు, గిరిరఘు, గొర్లె మాధవరావు,గులిపల్లి నాగ,ముసిరిపల్లి సరోజనమ్మ,రాపాక మాధవరావు,గొర్లె వెంకటరమణ,ఎర్రదాలినాయుడు,కర్రి రాంబాయి, ఎం.అప్పారావు,కె.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ దేశానికే ఆదర్శం



ఈ వృద్ధురాలు బలగ లక్ష్మమ్మ. ఈమెది పార్వతీపురం మండలంలోని తాళ్ల బురిడి గ్రామం. ప్రతి నెల ఇంటి వద్దకు వలంటీర్ తెచ్చి ఇస్తున్న పింఛన్, రేషన్‌తో జీవనం గడుపుతోంది. జగనన్న ఇస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3వేలతో చల్లగా నడుస్తున్న జీవితానికి ప్రతిపక్ష నేత చంద్రబాబు కష్టాలు తెచ్చాడని వాపోతోంది. తనకు ఎవ్వరూ తోడు లేరని పింఛన్ కోసం ఎలా కార్యాలయానికి వెళ్లగలనని ప్రశ్నిస్తోంది.

మా శాపనార్థాలు తగులుతాయి.



ఈయన కోట ధనుంజయ దివ్యాంగుడు. ఆయనది తాళ్లబురిడి గ్రామం. నడవలేక మంచానికే పరిమితమయ్యాడు. ప్రతి నెల వలంటీర్ ఇంటి వద్దకే పింఛన్ తెచ్చి ఇస్తుండేవారు. ప్రస్తుతం చంద్రబాబు కూటమి చేసిన మోసానికి పింఛన్ల కష్టాలు వచ్చాయని, నడవలేని తాను ఎలా వెళ్లి పింఛన్ అందుకోలేని పరిస్థితి చూపించి వాపోతున్నాడు. ఈ పాపం ఊరికే పోదని చంద్రబాబుకు తగులుతుందని, మా శాపనార్థాలు తగులుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సొంత కుటుంబసభ్యుల్లా చూసుకునేవారు.



ఈయన పేరు చుక్క చిన బాబు. ఆయనది పార్వతీపురం మండలం లక్ష్మీ నారాయణపురం గ్రామం. వలంటీర్లు సొంత కుటుంబసభ్యుల్లా అందరితో కలిసి ఉండేవారు. కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలు ఎనలేనివి. ప్రతినెలా మూడు వేల రూపాయలు ఇంటికి వచ్చి ఇచ్చేవారు. సంతోషంగా ఉండేది. వలంటీర్ల సేవలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

వీరే కాదు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పింఛన్ లబ్ధిదారులకు వలంటీర్ల సేవలు నిలిచిపోవడంతో తీవ్ర ఆవేదనలో ఉన్నారు. ఇంటికే తీసుకువచ్చి ఉదయాన్నే పింఛన్ అందించేవారని, ఇప్పుడు ఏ కార్యాలయానికి, ఎక్కడికి, ఎలా వెళ్లాలో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- వలంటీర్ల సేవలను అడ్డుకున్న విపక్షం
- లోటు తెలుస్తోందంటున్న లబ్ధిదారులు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ దేశానికే ఆదర్శం. అవ్వా తాతలకు అండగా నిలిచిన జగనన్న ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాట మేరకు పింఛన్ రూ. 3వేలు పంపిణీ చేస్తూ ఆర్థికంగా ఆదుకుంటోంది. ముఖ్యమంత్రి మానవతా దృక్పథంతో పింఛన్ పెంచి జవసత్వాలు కోల్పోయిన వారికి అండగా నిలిచారు. వలంటీర్లు ప్రతి నెల మొదటి తేదీన ఉదయాన్నే తలుపుతట్టి పింఛను అందించేవారు. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఓడించడం ఎవరి తరమూ కాదని విపక్షాలకు తెలిసిపోయినందున ప్రజలను ఇబ్బంది పెట్టే కార్యక్రమాలకు తెరతీస్తున్నారు. అందులో భాగంగానే వలంటీర్లు పింఛన్ ఇవ్వడానికి వీల్లేదంటూ పదేపదే ఇటు కోర్టులో అటు ఎన్నికల కమిషన్‌కు పిటిషన్లు అందజేశారు. అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులను ఇక్కట్లకు గురిచేసేలా చేపట్టిన విపరీత పోకడలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. సమాజ సేవ చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన సేవకు వలంటీర్ల అడ్డంకిగా మారారు.

సచివాలయంలో పింఛన్ అందజేత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌నాయుడు

బలిజిపేట: ఈ నెల 4వ తేదీ నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీడీఓ రమేష్‌నాయుడు తెలిపారు. కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రకారం వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయడానికి వీలులేనందున సచివాలయంలోనే పంపిణీ కార్యక్రమం నిర్వహించాలి. సచివాలయ ఉద్యోగులు మాత్రమే పింఛన్ అందజేస్తారు. లబ్ధిదారుకు నేరుగా నగదు చెల్లిస్తారు. పింఛన్ లబ్ధిదారులు సచివాలయం వద్దకు వచ్చి తీసుకోవాలి. నిబంధనలు సడలిస్తే సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ నేరుగా అందిస్తారని ఎంపీడీఓ రమేష్ నాయుడు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయానికి వెళ్లాలంటే కష్టం



నాపేరు కొట్నాన బాలాజీ, మాది పార్వతీపురం మన్యం జిల్లా, మక్కువ మండలం, కొండబుచ్చమ్మపేట గ్రామం. నాకాళ్లు రెండు చచ్చుబడిపోయాయి. నాకు దివ్యాంగ పింఛన్ ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటివరకు ప్రతినెల 1న వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్‌సొమ్ము అందించేవాడు. ఇప్పుడు ఎన్నికల కోడ్ వల్ల వలంటీర్లు పింఛన్ అందివ్వరని, సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని తెలిసింది. మా గ్రామం నుంచి 3కిలోమీటర్ల దూరంలో ఉన్న సరాయివలస సచివాలయానికి వెళ్లాల్సి ఉంది. నాకాళ్లు రెండు చచ్చుబడిపోయినందున, కాలకృత్యాలు తీర్చుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాను. అంతదూరం పింఛన్ సొమ్ముకోసం ఎలా వెళ్లగలను. గతంలో టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ సొమ్ము తెచ్చుకునేందుకు చాలా ఇబ్బందులు పడ్డాను. ఇప్పుడు మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయి.

కొట్నాన బాలాజీ, దివ్యాంగుడు, కొండబుచ్చమ్మపేట

21న ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి పరీక్ష



డీఈఓ జి.పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి ఈ నెల 21న పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 2024–25 విద్యాసంవత్సరంలో పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆదర్శ పాఠశాలలైన భామిని, కురుపాం, మునక్కాయవలస(మక్కువ) పురోహితునివలస(సాలూరు)లలో ఆరవ తరగతిలో ప్రవేశానికి పరీక్ష ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 6వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఎంపీసీ/బైపీసీ/ఎంఈసీ/సీఈసీ గ్రూపులలో ఉచిత విద్యకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ ఆదర్శ పాఠశాలల్లో బోధనా మాధ్యమం ఆంగ్లంలో ఉంటుందన్నారు. ఈ పాఠశాలలు సీబీఎస్ఈకి అనుబంధంగా ఉంటాయని తెలిపారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించేందుకు ఎటువంటి ఫీజులు వసూలు చేయబోరని స్పష్టం చేశారు. అభ్యర్థులు నెట్‌బ్యాంకింగ్/ క్రెడిట్/ డెబిట్ కార్డులను ఉపయోగించి పేమెంట్ గెట్‌వే ద్వారా పరీక్ష రుసుము చెల్లించిన తరువాత వారికి ఒక జనరల్ నంబర్ కేటాయిస్తారని, ఆ నంబర్ ఆధారంగా ఇంటర్‌నెట్ కేంద్రంలో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ లేదా హెచ్‌టీటీపీఎస్:// ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాల ప్రచారం



మక్కువలో త్రైతగ్రంథాలను ప్రచారం చేస్తున్న ప్రబోధసేవా సమితి సభ్యులు

మక్కువ: ఈనెల5వతేదీన ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల జన్మదినాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి సభ్యులు సోమవారం మండలకేంద్రం మక్కువలో అనుబంధ గ్రంథాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బొబ్బిలి కమిటీ అధ్యక్షుడు అప్పలనాయుడు మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు ఎంతో గొప్పవ్యక్తి, తత్వవేత్త అని, ఆధ్యాత్మికంలో మహాజ్ఞాని అని అన్నారు. అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత్వ సిద్ధాంతాలను సంపూర్ణంగా ప్రజలకు అందించారని చెప్పారు. అలాగే త్రైత సిద్ధాంత భగవద్గీత వివరంగా రాశారని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రబోధసేవా సమితి సభ్యులు ఎం.వెంకట్రావు, జి.శంకర్రావు, జి.గోపాలకృష్ణ, వై.వెంకటనాయుడు పాల్గొన్నారు.

పొత్తులతో కాదు..ప్రజాభిమానంతో గెలుస్తాం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- నర్సిపురంలో 'మేమంతా సిద్ధం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: పొత్తులు, కూటములతో కాదు..ప్రజాభిమానంతో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్వతీపురం మండలంలోని నర్సిపురం గ్రామంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలిసి మేమంతా సిద్ధం కార్యక్రమాన్ని వేలాది మందితో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించడంతో పాటు అభివృద్ధిలో పరుగులు పెట్టించిందన్నారు. పేదల సంక్షేమానికి సీఎం జగనన్న అగ్రతాంబూలం ఇవ్వడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. పేదరికమే అర్హతగా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపికచేసి వారి జీవన ప్రమాణాలలో పెనుమార్పులను సీఎం తీసుకొచ్చారన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను మీరందరూ ఆశీర్వదించి జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇచ్చి మన రాష్ట్రాన్ని, మన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని, అందుకు మీ అందరి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే పేరుపేరునా అభ్యర్థిస్తూ వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 200 కుటుంబాలు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరికలు జరుగుతున్నాయి. ఈ మేరకు మండలంలోని నర్సిపురం, కారాడవలసలో టీడీపీ, బీజేపీలకు చెందిన చెరుకుబిల్లి గంగయ్య, సిల్లా సోములు, గంగయ్య, బోను సూర్యనారాయణ, బోనెల సుందర్రావు, బోను సూరినారాయణ, పాందూరు చిరంజీవి, చెరుకుబిల్లి చంటి, బొబ్బిలి ప్రదీప్, బంటు పోలినాయుడు, శ్రీరాములుతో పాటు 200 కుటుంబాల వారు ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు తూముల భాస్కరరావు, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాథరావు, బంకురు రవికుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వి.గురురాజు, పోల సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, శ్రీనివాసరావు, సదానందం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: జూన్ 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే బీఎల్వోలు, సహాయ ఎన్నికల అధికారులు, డిజిటల్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన మెలకువలు అలవర్చుకోవాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి, సెక్టోరల్ ఎన్నికల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలు సకాలంలో సక్రమంగా నిర్వహించడం అందరి సహకారంతో సాధ్యమన్నారు. అలాగే ఓటర్లకు కనీస సదుపాయాల ఏర్పాటు, వృద్ధులు, వికలాంగులు వారి ఓటుహక్కు వినియోగించే క్రమంలో సమస్యలను సున్నితంగా పరిష్కరించడానికి ముందుగా శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పించు కోవాలని సూచించారు. తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటింగ్ మెషీన్ల ఉపయోగం, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు, తాగునీరు సమకూర్చడం తదితర అంశాలను వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు మరో పర్యాయం సరిచూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ పి చిట్టెమ్మ, ఎంఈఓ-1 జి.సూరిదేముడు, ఎంఈఓ-2 ఎం వెంకటరమణ, ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ, సచివాలయ ఉద్యోగులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

మా వలంటీర్‌తో పెన్షన్ పంపండి



మంచానికే పరిమితమైన మాకు వలంటీర్ల రూపంలో జగనన్న దేవుడిలా ఆదుకున్నాడు. ఒకటో తేదీ తెల్లవారు జామున పెన్షన్ డబ్బులు అందుకునే దాన్ని. మధ్యాహ్నం 12 గంటలైనా ఎవరూ రాలేదు.మా ఇంట్లో వాళ్లను అడిగితే వలంటీర్లు మరి రారు. మనమే సచివాలయానికి వెళ్లి పెన్షన్ తీసుకోవాలంటున్నారు. ఒకటోతేదీన పెన్షన్ అందుకోలేదు. ఎప్పుడు ఇస్తారో చెప్పిన వారే కరువయ్యారు. మా వలంటీర్‌ను మాకు పంపించి పెన్షన్ ఇప్పించండి. నేను ఇంటి బయటకే నడవలేను. సచివాలయానికి వెళ్లలేను. నాకు కాళ్లు చేతులు పనిచేయవు. పెన్షన్ అందకపోతే చావడమే తప్ప మరో ఆధారం లేదు.

జన్ని చిన్నమ్మి, పెదపదం, సాలూరు మండలం

వేడుకగా నవరాత్రుల ముహూర్తపు రాట



నెయ్యిలవీధిలో ముహూర్తపు రాట కార్యక్రమం

సాలూరు: ఉగాది రోజున ప్రారంభమయ్యే సీతారామ వసంత నవరాత్రుల వేడుకకు స్థానిక నెయ్యిలవీధిలోని శ్రీరామమందిరం వద్ద వేడుకగా సోమవారం ముహూర్తపు రాటను వేశారు. సింగిడి వెంకటేష్, కావ్య దంపతులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆకేటి రాము, స్థానిక నాయకులు టెక్కలి ధర్మారావు పాల్గొన్నారు.